

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## *17వ కథ*

**డియర్ రీడర్స్**

నది ప్రవహించేటపుడు మలుపులు తిరగకపోయినా ఒడ్డుని తాకుతూనే వెళ్తుంది. ఒక్కోసారి కథ కూడా మలుపులు తిరగకపోయినా గుండెను తాకుతుంది. ఈ నెల కౌముదికి కథనందించింది చాలా ప్రత్యేకమైన వ్యక్తి. వ్యక్తిగతంగా నేను చాలా అభిమానిస్తాను. మరెంతో గౌరవిస్తాను. ఆయనే ఈ కథలో హీరో. కథానాయకుడిని రాజ్ అని అనుకుందాం.

'నేను' అని కథ చెప్తున్న డా. రాజ్ ఎవరో మీకు కథ చివర్లో తెలుస్తుంది.

❦❦❦

దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం....

ఇంగ్లాండ్ లో ఒక హాస్పిటల్ లో పని చేస్తుండే వాడిని. భార్య, మా చిన్ని పాప నాతోనే ఉండే వారు. మేముండే టౌన్ మాకు బాగా నచ్చిన ప్రదేశాల్లో ఒకటి. శుభ్రమైన రోడ్లు, అందమైన పార్కులు, టౌన్ మధ్యగా పారుతుండే నది. అందంగా ప్రశాంతంగా ఉండేది.

ఓ వైపు హాస్పిటల్ లో పని చేస్తూనే, రాయల్ కాలేజ్ డిగ్రీ ఎఫ్.ఆర్.సి.ఎస్ రెండో పార్ట్ పరీక్ష కు కట్టాను. మొదటి పార్ట్ ఇంగ్లాండ్ రాకముందే పాసయ్యాను.

ఆ రోజు వైవా కు వెళ్ళాలి. అది సజావుగా అయిపోతే, తర్వాత క్లినికల్ ఎగ్జాం ఉంటుంది.

ఆ రోజు ముఖ్యమైన పరీక్ష అని తనకు ముందే తెలుసు. పాపని నా చేతికిచ్చి తను నా సూట్ ఐరన్ చేస్తోంది. పాప, తన కుక్క బొమ్మతో సహా నా వళ్ళో కూర్చుని ముద్దుమాటలు చెప్తోంది.

'కుక్క బాగా అల్లరి చేస్తోందట, చాలా బాడ్ అట.'

పాప జుట్టుతో ఆడుకుంటూ " కొడదాంలే" అన్నాను.

"కొట్టకూడదు, దానికి మమ్మీ, డాడీ లేరు కదా" వెనక్కి తిరిగి నాతో అంది పాప.

"నిజమే. నిజమే " ఒప్పుకున్నాను.

"డార్క్ రూం లో కూడా ఎయ్యకూడదు. బయమేస్తది." మళ్ళీ తనే చెప్పింది.

"మరేం చేద్దాం."

"స్కూల్లో పడెయ్యాలి."

"అలాగే" నవ్వుతూ అన్నాను.

అప్పటికే ఇండియాలో పీజీ చేసి ఉండడం వల్లనేమో పరీక్ష తాలూకు వత్తిడేమీ లేదు.

ఇప్పటి వాళ్ళతో పోలిస్తే, మా తరం వాళ్ళకు టెన్షన్ తక్కువే. పరీక్షా సమయాల్లో టెన్షన్ పడాల్సిందే అని నేర్పని తల్లిదండ్రులు, గురువులుండడం మేము చేసుకున్న గొప్ప అదృష్టం.

త్వరగా రెడీ అయిపోయి ఎగ్జామినేషన్ కు వెళ్ళిపోయాను.

వైవా పరీక్షలో నాలుగు స్టేషన్లుంటాయి. ఒక్కో స్టేషన్ లో ఇద్దరు ఎగ్జామినర్స్ కూర్చుని ఉంటారు. కనీసం మూడు ప్రశ్నలకు సరిగ్గా జవాబు చెప్పాలి. ఎక్కువ చెప్పగలిగితే బెటర్.

మధ్యలో ఒక స్టేషన్ లో ఒక ఎగ్జామినర్ అడిగిన ప్రశ్న కు జవాబు చెప్పాను. అతనికది సరైన ఆన్సర్ అని అనిపించలేదేమో, నేను చెప్పిన దానికి ఒప్పుకోలేదు. అది కరెక్ట్ కాదేమోనన్నాడు. నేను చెప్పింది కరెక్టేనని నాకు తెలుసు గనక నేను చెప్పినదానికే కట్టుబడి ఉన్నాను. నా జవాబు మార్చుకోవడానికి నాకెన్నో అవాకాశాలిస్తున్నాడు. నేను వాటిని పక్కన పెట్టేశాను.

తన చెప్పిందే కరెక్ట్ అనిపించడానికి చాలా రకాలుగా ప్రయత్నిస్తున్నాడు. సౌమ్యంగానే నేను కాదన్నాను. టైం గడిచి పోతోంది.

మూడు ప్రశ్నల సంగతి దేవుడెరుగు. మొదటి ప్రశ్న దగ్గరే ఇద్దరం ఆగిపోయాం.

ఇద్దరమూ వెనక్కి తగ్గడానికి రెడీగా లేము.

పరిస్థితి స్థంభించిపోయింది. చలిదేశం లో వాతావరణం వేడెక్కుతోంది. పక్కనున్న రెండో ఎగ్జామినర్ కు మా ధోరణి కంగారుగా ఉంది. పరీక్ష చెడగొట్టుకోవడానికి నేను చేస్తున్న ప్రయత్నాలు చూసి అసహనంగా కదిలాడు. ఏమిటీ మొండి పట్టుదల అన్నట్టు నా వంక విచిత్రంగా చూశాడు. సబ్జెక్ట్ మీదున్న పట్టు తప్ప, మొండి పట్టు కాదని స్థిరంగా ఉన్నాను.

ఇంకో పక్కన టైమైపోతోంది. పక్కనున్న ఎగ్జామినర్ కొన్ని ప్రశ్నలడిగాడు. సంతృప్తికరంగానే సమాధానాలు చెప్పాను.

ఇంతలో బెల్ మోగింది. లేచి మొదటి ఎగ్జామినర్ వైపోక సారి చూశాను. నా వైపు చూడడం కూడా ఇష్టపడనట్లు వేరే వైపు చూస్తున్నాడు. అతని ముఖంలో నా పట్ల అయిష్టత నేను చదవగలిగినంత స్పష్టంగా ఉంది.

ముందుకెళ్ళిపోయాను.

సాయంత్రానికి రిజల్ట్స్ పెడతారు, కానీ అంతవరకూ ఆగాలనిపించలేదు. ఎటూ పరీక్ష పోవడం ఖాయం. నిరాశగా ఉంటుందేమో అనుకున్నాను కానీ, మనసు నిశ్చలంగా , ప్రశాంతంగా ఉంది. ఇంటికెళ్ళిపోదామని చూస్తుండగా , వేణు ఎదురొచ్చాడు.

"ఏరా అయిందా, ఇరగదియ్యడం?" వాడికి నామీద బాగా నమ్మకం.

"ఊ, అయింది ఇప్పుడే."

"మరేంట్రా నీరసం? ఓహో , అనుకున్న రేంజ్ లో లేదా? ఎగ్జామినర్స్ ని కూడా కాస్త బతకనియ్యరా."

"అదేం కాదురా. నే పోతున్నా" వీడికి జరిగింది చెప్పినా నమ్మడు.

"వెళ్ళరా, నువ్వు మాలాగా రిజల్ట్స్ కోసం ఆగితే అది మాకే అవమానం. సాయంత్రం నేను చూసి ఫోన్ చేస్తాలే"

ట్రెయిన్ లో ఇంటికెళ్తూ ఆలోచిస్తున్నా. అలా ఒకే ప్రశ్న దగ్గర నిలబడి పోకుండా ఉండాల్సిందని ఎక్కడో అనిపిస్తున్నా, ఎగ్జామినర్ ఇంప్రెస్ చేయనందుకు బాధగా లేదు. నన్ను నేను అవమానించుకోనందుకు తృప్తిగా ఉంది.

ఇంటికెళ్ళి చూస్తే  పాప పడుకుని ఉంది. కుక్క బొమ్మను  పట్టుకుని నిద్రపోతోంది.  ప్రపంచం లోని ప్రశాంతత మొత్తం నా కూతురి ముఖంలోనే ఉంది.  పాప నిద్ర చెడకుండా చాలా నెమ్మదిగా పడుకున్నాను. నిద్రపట్టింది.

ఎంత సేపు నిద్రపోయానో తెలియదు.

నిద్రలో ఎక్కడో ఫోన్ మోగుతోంది. తనొచ్చి మెల్లగా తట్టి లేపి

"వేణు లైన్లో ఉన్నాడు" అంది.

నేను ఫోన్ దగ్గరకు నడుస్తుంటే , నాతో పాటే వచ్చింది.

తన వంక చూశాను. శుభవార్త నా మొహంలోనే చదువుదామని అక్కడే నిల్చుని నా ముఖం వంకే చూస్తోంది.

పరీక్ష పోయిందని తనకి తెలిస్తే బాధపడుతుంది.

సాధ్యమైనంత మామూలుగా

"ఏంటి వేణూ ?"

"మావా , నేను పాసయ్యా."  సంతోషంగా ఉన్నపుడే వాడు వరస కలుపుతాడు.

"కంగ్రాట్స్ రా."

“వెనకటికి ఒకడుండేవాడంట . వాడూ నీలాంటోడే”

పాపం నేను తప్పానని చెప్పలేక ఏదో కథ మొదలెట్టినట్టున్నాడు.

“అడివిలో శబ్దం వచ్చిన వైపు కళ్ళు మూసుకుని బాణమేసి, ముందుకెళ్ళిపోతాడు. మళ్ళా అటుపక్క కూడా చూడడు.”

‘అంటే తప్పానా? ‘

“ బాణమెయ్యడమే ఆడిపని. ష్యూర్ షూటర్...నీలాగా.”

“అయితే?”

“అయితే గియితే లేదు. నాలాంటోడు పోయి బాణాన్నీ, బాణానికి గుచ్చుకున్న కోడినో , పుంజునో తెచ్చుకుంటాడు. బిరియానీ వండుకోవాలి కదా.”

“ఏంట్రా నీ  సోది? ఇంతకూ నా పేరు లిస్ట్ లో ఉందా లేదా?”  విసుగ్గా అన్నాను.

“నీ పేరు లేకుండా లిస్ట్ పెట్టడానికి  అసలా తెల్లోళ్ళకెన్ని గుండెలు.”

“ ఏరా సరిగ్గా చూశావా? వైవా నేనేం బాగా చెయ్యలేదు.”  అనుమానం పోకపోవడం తో మళ్ళీ అడిగాను.

నా ఎదురుగా ఉన్న ముఖంలో దిగులు మేఘం కమ్ముకోవడం చూస్తున్నా.

“భలేవాడివే. నా పేరుకన్నా ముందు నీపేరే వెతికాను.”

" ఏంటి వేణూ, సరిగ్గా చెప్పు. " తను ఫోన్ లాక్కుంది.

అవతలి కబురు వింటూనే వికసించింది ఆమె ముఖం.

వైవా పాసయిన కొన్నాళ్ళకు క్లినికల్ పరీక్ష.

నాకు వచ్చిన కేసులొకసారి చూసుకున్నాను. నాకు తెలియకుండానే మొహం మీదకు చిరునవ్వు వచ్చి చేరింది.

అంతా అయ్యాక నా ఎగ్జామినర్స్ ఎవరా అని చూస్తే చిరునవ్వు ఎగిరిపోయింది. వైవాలో ఎదురైన ఎగ్జామినర్ ఉన్నాడు. నన్ను గుర్తు పట్టినట్టు అతని చూపు చెప్పింది. అతడి ముఖంలో అదే అప్రసన్నత.

పరీక్ష జరుగుతున్నంత సేపూ ఆ భావాలను స్పష్టంగా వ్యక్తం చేస్తూనే ఉన్నాడు.

వైవా లో ఎలా పాసయ్యానో తెలియదు. కానీ అతని ముఖంలో అయిష్టత, అతని ప్రవర్తన చూస్తుంటే మాత్రం డిగ్రీ చేతికొస్తుందన్న నమ్మకమే రాలేదు. ఏమిటితను , ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు.

ఏది ఎలా జరగాల్సి ఉంటే అలా జరుగుతుందని ఎంత సమాధాన పడాలని చూసినా ఎక్కడో నిరాశగానే ఉంది.

మూడు రోజుల తర్వాత నేను పరీక్ష పాసయినట్టు లెటర్ వచ్చింది. ఎంత విచిత్రం. తప్పుతానని అనుకున్న పరీక్ష ఎలా పాసయ్యాను?

ఆ ఎగ్జామినర్ మొహం, మొహం లోని అయిష్టత కళ్ళ ముందు నిలిచింది. పాస్ కావడం అసంభవమనుకున్నాము.

జరుగుతాయని భయపడేవి సగానికి పైగా జరగనే జరగవు.

కాన్వొకేషన్ రోజు.

మన విజయాలకు మన కన్నా, మనల్ని ప్రేమించేవారే ఎక్కువ సంతోషపడతారు.

ఉదయం నుండీ తన సంతోషం అంతా ఇంతా కాదు. నాకన్నా తనే ఉత్సాహంగా ఉంది. పాపకు ఎలాంటి డ్రెస్ వెయ్యాలా అని హడావుడి పడుతోంది. ఇద్దరం పాపను కూడా తీసుకుని వెళ్ళాము. తెలిసిన వాళ్ళు చాలా మంది కనిపించారు. నేను ఎవరితోనో మాట్లాడుతుంటే దూరంగా ఒక చోట అతను కనిపించాడు.

నా ఎగ్జామినర్.

దగ్గరకెళ్ళి విష్ చేశాను. పొడుగ్గా, సన్నగా, ఫిట్నెస్ ఉన్న శరీరం. అతని దాదాపు యాభై ఏళ్ళుంటాయి. అతన్ని చూస్తే , కొంత మంది యవ్వనంలో కన్నా ఒక వయసు తర్వాతే బాగుంటారేమోననిపించింది. డార్క్ కలర్ సూట్ వేసుకున్నాడు. .

చాలా సంతోషంగా నాతో చేయి కలిపాడు. పరీక్ష టైం లో ఉన్న మనిషికీ , నేను చూస్తున్న మనిషికీ పోలికే లేదు. తన మాటలతో చాలా నవ్విస్తున్నాడు. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. అతనితో మాట్లాడుతూ తనూ , పాప ఎక్కడున్నారోనని కళ్ళతో వెతికి చూశాను. దూరంగా నిలబడి నావంకే చూస్తున్నారు. నేను తనవైపు చూడగానే , వాళ్ళమ్మ చేతిని వదిలించుకుని పాప నా దగ్గరకు వచ్చేసింది.

"మీ అమ్మాయా?" అడిగాడు.

నవ్వుతూ తలూపాను. పేరేమిటో అడిగాడు.

పాప చేయందుకోవడానికి బాగా వంగాడు. తన చేయందుకుని “కంగ్రాట్స్” అన్నాడు. కొద్దిగా ఆగి " ఫర్ హేవింగ్ ఏన్ ఎక్సలెంట్ ఫాదర్" అన్నాడు.

కంగ్రాట్స్ అంటే ఏమిటో, ఎందుకో తెలియనంత చిన్న వయసు. నేను ‘థాంక్స్’ చెప్పమంటే సిగ్గుపడుతూ 'థాంక్యూ' చెప్పింది.

"మీరు , మీ సబ్జెక్ట్ ఎక్సలెంట్" అని మళ్ళీ నాతో అన్నాడు.

ఆ ప్రశంస ఎక్కడో తాకింది.

నా భార్యకు తనను తానే పరిచయం చేసుకున్నాడు.

"ఐయాం కోలిన్" అంటూ.

నేను అతని వద్ద వీడ్కోలు తీసుకుని, పాపనెత్తుకుని వచ్చేస్తున్నాను.

రెండు నిముషాలాగి వెనక్కి తిరిగి చూస్తే అతను మావంకే చూస్తూ ఉన్నాడు. సంతోషంగా, ప్రేమపూర్వకంగా

డా. కోలిన్, స్కాట్లాండ్ కు చెందిన జనరల్ సర్జన్.

కొన్నేళ్ళ పాటు యు కె లో పనిచేశాక నేను ఇండియా తిరిగి వచ్చేశాను. డాక్టర్ గా తీరిక లేని జీవితం. జీవితంలో ఎన్నో మార్పులు.

కుటుంబం, స్నేహితులు, అందరూ మెచ్చుకున్న మార్పులు. నాక్కూడా నచ్చిన మార్పులు.

ఎఫ్ .ఆర్ .సి.ఎస్ , ఇప్పుడు ఎం.ఆర్. సి.ఎస్ అయింది. ఇంగ్లాండ్ లోనే కాదు, ఇండియాలో కూడా ఆ పరీక్ష కిప్పుడు సెంటర్లున్నాయి. ఇంగ్లాండ్ నుండి కొంతమంది ఎగ్జామినర్స్ , ఇక్కడ లోకల్ ఎగ్జామినర్స్ లో కలిసి పరీక్ష నిర్విహిస్తున్నారు. నేను ఆ పరీక్ష కు లోకల్ ఎగ్జామినర్ గా వ్యవహరిస్తుంటాను.

2008 లో అనుకుంటా, ఓ సారి కలకత్తాలో జరిగే రాయల్ కాలేజ్ పరిక్ష కు ఎగ్జామినర్ గా వెళ్ళాల్సి వచ్చింది. . పాపకేవో పరిక్షలు. తను రానంది. ఒక్కడినే వెళ్ళాను.

నేను పరీక్ష జరిగే చోటు దగ్గరకెళ్ళేసరికి అప్పటికింకా పరీక్ష మొదలు కాలేదు.

బయట టెన్షన్ పులుముకున్న మొహాలతో స్టూడెంట్స్ నిలబడి బుక్స్ లోకి తొంగి చూస్తున్నారు.

ఒకప్పుడు పిల్లలకు పరీక్షలెందుకసలు అనుకునేవాడిని. జాలికలిగేది. ఇప్పుడెందుకో అది చాలా అవసరమనిపిస్తోంది. బాధ్యత గలిగిన పాత్ర నిర్వహించాలంటే ఆ మాత్రం ఒరిపిడి అవసరమే.

పది పన్నెండుమంది బ్రిటీష్ నుండి వచ్చిన ఎగ్జామినర్స్ ఉన్నారు. వాళ్లంతా ఒక చోట చేరి మాట్లాడుకుంటున్నారు. ఒకతను మాత్రం దూరంగా నిల్చుని ఉన్నాడు. అతన్ని ఎక్కడో చూసిన జ్ఞాపకం. గుర్తుపట్టగానే చాలా ఆశ్చర్యం వేసింది.

అతనే. డా. కోలిన్!

వయసు వల్ల వచ్చిన చిన్న చిన్న మార్పులు తప్ప పెద్ద తేడా లేదు. అదే అందమైన విగ్రహం.

స్కాట్లాండ్ వాడవడం వల్లనేమో, బ్రిటీష్ ఎగ్జామినర్స్ ఎవరూ అతనితో పెద్దగా మాట్లాడడం లేదు.

ఎగ్జామినర్స్ అందరం ఇద్దరిద్దరుగా కూర్చున్నాము. నేను కోలిన్ తో పాటు కూర్చున్నాను.

కొన్నేళ్ళ క్రితం నా ఎగ్జామినర్. ఇప్పుడు నా తోటి ఎగ్జామినర్ అయ్యాడు.

నాకతను గుర్తుండడం, అతనికి నేను గుర్తులేకపోవడం రెండూ సహజమేననిపించింది.

లంచ్ టైం లో కూడా బ్రిటీష్ ఎగ్జామినర్స్ ఇతన్ని కలుపుకోలేదు. నేనే లంచ్ కు తీసుకెళ్ళాను. నా పరీక్ష నాటి సంఘటన అతనికి గుర్తు తెచ్చాను. నేను చెప్తుంటే అతను చాలా సంభ్రమంగా విన్నాడు. తనుకూడా చాలా త్వరగా గుర్తు తెచ్చుకుని చెప్పాడు. అన్ని సంవత్సరాల పాటు అతనికా విషయం గుర్తుండడం నాకు ఆశ్చర్యంగా ఉంది.

వృత్తి పరంగా,నేను ఏమేం చేస్తున్నానో అడిగి తెలుసుకున్నాడు. నేను చెప్తుంటే చాలా శ్రధ్ధగా ఉన్నాడు. సంతోషం వ్యక్తం చేశాడు.

ఎక్కడ దిగానో కనుక్కున్నాడు. ఇద్దరం ఒకే హోటల్ లో ఉన్నాము.

తర్వాతి రోజు సెలవు. పరీక్ష లేదు. నేను ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే,

"హలో" అన్న పలకరింపు వినిపించింది.

ఎదురుగా స్నేహపూరితమైన చిరునవ్వుతో కోలిన్ నిలబడి ఉన్నాడు.

"కెన్ ఐ జాయిన్ యూ"

“తప్పకుండా.” అప్రయత్నంగా లేచి నిలబడి చెప్పాను.

“కూర్చో” అంటూ నా భుజాలమీద చేతులు వేసి కూర్చోబెట్టాడు.

ఓ అయిదు నిముషాలకు తన ప్లేట్ తీసుకొచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు.

ఆ రోజు ఇద్దరికీ ఖాళీయే. తనకు ఊరు చూడాలని ఉందన్నాడు.

కలకత్తా లో చూడదగ్గవేమున్నాయో సిటీ గైడ్ చూసుకున్నాము.

“మీకేం చూడాలని ఉంది. చర్చ్ కు వెళ్దామా?”

“ఊహూ. ఏదైనా కొత్తది , కొత్తగా చూడాలి.” అలా అంటున్నపుడు కోలిన్ కళ్ళలో మెరుపు .

కాసేపటి తర్వాత హౌరా బ్రిడ్జ్ మీద ఉన్నాము. కింద ప్రవహిస్తున్న హుగ్లీ నది వంక చూస్తూ నుంచున్నాం. నదిలో కొందరు స్నానం చేస్తున్నారు. దూరంగా ఏవో ఫాక్టరీలు, ఆ ఫాక్టరీల నుండి వెలువడే పొగకు చుట్టుపక్కల చెట్లు బూడిదరంగులో కనిపిస్తున్నాయి. ఒకవైపు చూస్తే పూల మార్కెట్. పెద్ద పెద్ద దండలుగా గుచ్చిన పూలు.

వేరే వైపు చూస్తే హౌరా స్టేషన్. స్టేషన్ రోడ్ మీద మనుషులు పెద్ద పెద్ద బరువులు మోస్తూ వెళ్తున్నారు.

“మనం అదృష్టవంతులం రాజ్”

“ఏం కోలిన్? ఎందుకలా?”

“డాక్టర్ కాకపోయుంటే, అలాంటి పనులు చేయగలమా?

“ఎందుకు చేయలేము. జీవితం , అవసరం అన్నీ నేర్పిస్తుంది.” అన్నాను కానీ, అలా మాట్లాడగలనని నాకు కూడా తెలియదు.

బ్రిడ్జ్ మీద అమ్ముతున్న ఇండియన్ కాయిన్స్ కొనుక్కున్నాడు కోలిన్.

సాయంకాలం కాళీమాత గుడికి తీసుకెళ్ళాను.

దర్శనం చేసుకునే భక్తుల క్యూ చాలా పెద్దదిగా ఉంది. . మమ్మల్ని చూడగానే దళారీలు చుట్టుముట్టారు. త్వరగా దర్శనం చేయిస్తామనీ, దగ్గరగా చూపిస్తామనీ చెప్తూ మా వెంట బడ్డారు. క్యూ బైపాస్ చేసే పద్ధతులు అక్కడ విచ్చలవిడిగా అమ్మకానికున్నాయి.

భక్తి తో బతికే వారికన్నా, భక్తి మీద బతికేవారే ఎక్కువ.

“రాజ్, మనం అందరిలా లైన్లో వెళ్దాము.”

“మిస్టర్ కోలిన్ , అది చాలా కష్టం.”

కోలిన్ ఒప్పుకోలేదు. క్యూలోనే వెళ్ళాలని పట్టుబట్టాడు.

కొంత సేపటికి లైన్లో రద్దీ ఎక్కువైంది. పవిత్రమైన ప్రదేశానికనుగుణంగా అక్కడి వాతావరణం గానీ, మనుషుల ప్రవర్తన గానీ లేవు. ఎవరిలోనూ ప్రశాంతత లేదు. భక్తి ఎక్కువైన కొద్దీ తోపులాట మొదలవుతుంది. ఆ తోసుకోవడం చూస్తుంటే ఎక్కువ తోసుకున్న వాళ్ళకు కాళీమాత ఎక్కువ వరాలనుగ్రహిస్తుందేమో అన్న అనుమానం వచ్చింది.

కోలిన్ ని తోసేస్తున్నారు. ఆయన మొహం ఎర్ర బడిపోతోంది. నేను చేతులు రెండూ అడ్డు పెట్టి కాపాడబోయాను. పద్ధతిగా క్యూలో వెళ్తే ఆయన్ని క్షేమంగా బయటి తీసుకురాగలనా అన్న భయం వేసింది.

ఆయన్ని లైన్ నుండి బయటకు తీసుకుని వచ్చేశాను. నా పద్ధతిలో దర్శనం చేసుకుని ఒక పావుగంటలో బయటికొచ్చాం.

“ఆమె ఎందుకంత కోపంగా ఉంది రాజ్”

“ఎవరూ?” చుట్టూ చూశాను.

“లోపల దేవత రాజ్. నీకు భయం వెయ్యలేదూ?”

“కోపం కాదు మిస్టర్ కోలిన్. ఆమె, ఆత్మాభిమానానికి ప్రతి రూపం. స్త్రీని అవమానించే మగవారికో హెచ్చరిక, ఆ రూపం."

గుడి బయట రకరకాల షాపులు. పూసల దండలు, బొమ్మలు, గాజులు, ఇంకేవేవో ఇత్తడి సామాన్లు అమ్ముతున్నారు. బతుకు కోసం ఎంతో మంది అక్కడ కూర్చున్నారు. షాపులోపలికి రమ్మనమని మమ్మల్ని పిలుస్తున్నారు. ప్రతివారి మొహం లోనూ మేము వస్తే బాగుండన్న ఆశ.

ఏ చిన్నది చూసినా కోలిన్ ఆగిపోతాడు. ఇది భార్యకు బాగుంటుందా లేక కూతురికి బాగుంటుందా అని ఆకాశం వంక చూస్తూ ఆలోచిస్తుంటాడు. నాకెందుకో అతని మీద విసుగు రావడం లేదు. మా పాప ముద్దుగా అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటుంటే గమనించినట్లు అతన్ని గమనిస్తున్నాను.

తన భార్యకు, కూతురికీ ఇండియన్ డ్రెస్సులు కొనాలని నా సహాయం అడిగాడు కోలిన్.

“నాకూ పెద్దగా తెలియదు మిస్టర్ కోలిన్! అసలు నా బట్టలూ అవీ నా భార్యే తీసుకొస్తుంది. ”

“అదేంటీ. నీ భార్యకు బహుమతులివ్వవా? బట్టలు కొనవా?”

జవాబు చెప్పడానికి నేనేమీ తడుముకోలేదు. సిగ్గుపడలేదు.

"అలాంటి చట్ట వ్యతిరేకమైన పనులు మా దేశపు మగవారు చెయ్యరు కోలిన్."

మరెలా అని ఆలోచిస్తుంటే, నేను ఇంటికి ఫోన్ చేశాను.

“ఓ విషయంలో నీ హెల్ప్ కావాలోయ్. ఈ చీరలు , డ్రెస్సులు ఎలా కొనాలీ?”

“డబ్బులిచ్చి కొనాలి.”

“సరేలేవోయ్, ఆ మాత్రం మాకూ తెలుసు. చీర కొనాలి. కొన్ని టిప్స్ చెప్పు.”

"మీరే చీరా కొనక్కర్లేదు. అది కర్టెన్లక్కూడా పనికి రాదని తేలిపోయిందొకసారి."

"నీక్కాదోయ్ , వేరే ఒకావిడకు."

"ఎలా ఉంటుంది ఆ వేరే ఒకావిడ?"

"తెల్లగా ఉంటుంది. అంతవరకు తెలుసు"

"తెల్లవాళ్ళకు లైట్ కలర్స్ బాగుంటాయి. లేత గులాబి రంగు , లేత నీలం."

"ఇంతకూ ఎవరో అడగవా?"

"ఎవరో ఇంగ్లాండ్ మనిషి భార్య అయుంటుంది. ఆయన బాడ్ లక్ కొద్దీ, షాపింగ్ కు మిమ్మల్ని తీసుకెళ్ళి ఉంటాడు. మీరు ఫోన్ చేసి నన్నడిగారు. ఇదో పెద్ద విషయమా."

అంతా చూసినట్టే చెప్పేస్తుందేంటీ!

దేవుడు లేడీస్ కు ఇంతింత తెలివితేటలిచ్చి భూమ్మీదకు పంపిస్తే మగవాళ్ళేమైపోవాలీ?

భార్యకూ, కొడుక్కీ , కూతురికీ బట్టలు, బహుమతులు కొన్నాడు. వాటి బిల్ చెల్లించేందుకు షాపతనికి తన క్రెడిట్ కార్డ్ ఇచ్చాడు. ఆ షాపుల్లో స్వైపింగ్ మెషీన్ లేదు. డబ్బు ఇవ్వమన్నారు. అతని దగ్గర ఇండియన్ మనీ లేదు. నాదగ్గరుంటే ఇచ్చాను.

ఎగ్జామినేషన్ కమిటీ అరేంజ్ చేసిన డిన్నర్ వెళ్ళే టైం అయింది. ఆకలి కూడా వేస్తోంది.

వెళ్దామని నేను త్వరపడుతుంటే, కోలిన్ కు ఆ డిన్నర్ కెళ్దామన్న అసక్తే లేదు. అక్కడి లోకల్ ఫుడ్ తింటానని గొడవ చేశాడు.

"స్ట్రీట్ ఫుడ్ తింటే జబ్బు చేస్తుంది మిస్టర్ కోలిన్"

"ఏం పర్లేదు. మందులేసుకుంటాను."

"వద్దు . మీకు ఇమ్యూనిటీ ఉండదు. నామాట వినండి"

"పాముక్కూడా మనిషిని చూస్తే భయమేనట రాజ్. ఇంత పెద్ద డాక్టర్ని చూస్తే బాక్టీరియాలకు భయమేయదంటావా?"

ఆ స్ట్రీట్ ఫుడ్ , సమోసాలు, పానీ పూరీలు, కలకత్తా స్పెషల్ రసగుల్లాలు ,అవి అరేంజ్ చేసిన పద్ధతి అవి చూస్తుంటే ఎంతటి వారికైనా ఇలాంటి తెగింపే వస్తుందేమో?

ఏదైతే అదయ్యింది , ముందు తినేద్దాం. తర్వాత సంగతి తర్వాత అన్న తెగింపు.

అక్కడే ఒక షాపులో చిన్న నేప్కిన్ కొని మా పాపకు కట్టినట్లు అతని మెడలో కట్టాను. మినరల్ వాటర్ బాటిల్ తీసుకుని అతని పక్కనే నిలబడ్డా. తినేటపుడు మాత్రం తనని డిస్టర్బ్ చెయ్యదలుచుకోలేదు.

నేనూ తిన్నాను కానీ ఫుడ్ ఎంజాయ్ చేయడంలో తనే సీనియర్ అని నిరూపించుకున్నాడు.

కడుపు నిండిందేమో, ఇక తినలేక

“రేపు కూడా నన్నిక్కడికి తీసుకురావాలి రాజ్.” అని మాట తీసుకున్నాడు.

హోటల్ కు వచ్చేశాము. రిసెప్షన్ లో ఉన్న అమ్మాయితో తనకు ఇండియన్ రూపీస్ కావాలని అడిగాడు.

ఆమె ప్రస్తుతం లేవనీ, తర్వాత అరేంజ్ చేస్తానని చెప్తోంది.

“కోలిన్ , నా దగ్గరున్నాయి. అయినా ఇంత రాత్రి వేళ మీకు డబ్బెందుకు?”

“నామీద చాలా ఖర్చు పెట్టావుకదా. అవన్నీ నీకివ్వాలి కదా!”

“అదేమంత అమౌంట్ అనీ.”

“చిన్న అమౌంట్ అయినా తిరిగివ్వకపోతే నాకసలు బాగోదు.”

“మీరిస్తే నాకూ బాగోదు మరి.”

“నా పిల్లలు నాకోసం ఖర్చు పెట్టినా తిరిగిచ్చేస్తాను రాజ్ .”

“పేరెంట్స్ కు ఏదైనా ఇవ్వాల్సి వస్తే , అది మా అదృష్టంగా భావిస్తాము కోలిన్."

తన భార్యకు, పిల్లలకు కొన్న బహుమతులకైనా ఇచ్చేస్తానని పట్టు బట్టాడు. సరే అన్నాను.

రూం కి వెళ్ళాక , ఇంటికి ఫోన్ చేసి మాట్లాడాను. పాప నా ఫోన్ కోసమే ఎదురు చూస్తోంది.

ఫోన్ మాట్లాడి పెట్టేశాక రూం లో హోటల్ ఫోన్ మోగింది.

అవతల వైపు కోలిన్.

"రాజ్, ఓ సారి నా రూం కి వస్తావా?"

'ఇప్పుడింత రాత్రి పూట డబ్బివాలా, ఈయనకు మరీ చాదస్తం' అనుకుంటూ వెళ్ళాను.

బెల్ నొక్కిన వెంటనే తెరుచుకుంది. నాకోసమే ఎదురు చూస్తున్నాడనుకుంటా.

రా రా అంటూ లోపలికి తీసుకెళ్ళాడు.

నా రూం తో పోలిస్తే కోలిన్ రూం విశాలంగా ఉంది. వ్యూ కూడా బాగుంది.

బాల్కనీ లో మసక చీకటి. చేతికందే దూరంలో ఎత్తైన చెట్లు. వెన్నెల్లో మెరుస్తున్నాయి. రాత్రి చలిగా ఉంది. ఇంగ్లాండ్ చలి అలవాటైన మా ఇద్దరికీ ఆ చిరు చలి హాయిగా ఉంది. చెట్ల మధ్యలో దూరంగా చంద్రుడు కనిపిస్తున్నాడు.

దూరంగా కలకత్తా ట్రాఫిక్ చప్పుళ్ళు హోటల్ ఆవరణలోని ప్రశాంతత ను చెదరగొట్ట లేకపోతున్నాయి.

కోలిన్ నా గురించీ, నా కుటుంబం గురించీ అడిగాడు. ఇంకేవో కొన్ని వివరాలు అడిగాడు. చెప్తుంటే విని కొంత సేపు మౌనంగా కూర్చున్నాడు.

తర్వాత తన కుటుంబం గురించి చెప్పడం ప్రారంభించాడు. తన భార్యను ఎలా కలిసిందీ, ఎలా ఇష్టపడిందీ చెప్తున్నాడు. నా స్నేహితుల ప్రేమ కథలు నేను చాలానే విన్నాను. పక్కవాళ్ళ ప్రేమలు వినడానికి చాలా ఓపిక కావాలి అనిపించేది.

కానీ కోలిన్ గొంతులో నిజాయితీ, ఆమె పట్ల అతనికుండే ప్రేమాతిశయం నన్ను కట్టిపడేస్తున్నాయి. ముఖ్యమైన పాఠం వింటున్నంత శ్రద్ధగా వింటున్నాను. వాళ్ళ పెళ్ళి ఎలా అయిందో చెప్పాడు. ఏవేవో సంఘటనలు, ఒకదాని కొకటి సంబంధం లేనివి వివరిస్తున్నాడు. వింటుంటే వారిద్దరికీ ఒకరి పట్ల ఒకరికున్న గౌరవం, ప్రేమ, తెలుస్తున్నాయి. ఇంకా చెప్తే బాగుండు అనిపిస్తోంది. ఎప్పటికీ ఆపకూడదనిపిస్తోంది.

చల్లని వెన్నెల రాత్రి నిశ్శబ్దంగా ఆ ప్రేమకథను వింటూ మైమరచిపోతోంది. దగ్గరలో ఉన్న ఎత్తైన వగరు పరిమళపు పూల చెట్టు ఆకు కదల్చకుండా వింటోంది. చంద్రుడు వెన్నెలను ధారపోస్తూ నిశ్చలంగా నిలబడ్డాడు. వెన్నెల అతని ప్రేమ లో పరవశించి తడిసిపోయింది.

ఆమె పేరేమిటో అడగాలని అనుకున్నాను. ఆ ప్రేమ ప్రవాహానికి అడ్డు పడే ధైర్యం చెయ్యడం లేదు.

చదువు, పని, రోగులు ఇవితప్ప వేరే లోకమెరగని నాకు, అందమైన వింతలోకంలో విహరించినట్లున్నది. ప్రేమ భావన పట్ల గౌరవం , నా భార్య పట్ల అభిమానం మరింత పెరిగింది. అప్పటికప్పుడు లేచి ఇంటికి ఫోన్ చెయ్యాలని అనిపించింది.

భార్యే ప్రాణమనుకునే భర్త, అతని కోసం ప్రాణమివ్వగల భార్య, ఇద్దరూ ప్రాణ స్నేహితుల్లా బతకడం , వింటుంటేనే నా గుండె నిండి పోయింది. మనసు పరవశించిపోతోంది.

స్నేహితులిద్దరూ ఒకరికొకరు బహుమతినిచ్చుకున్నారు. కోలిన్ కు కొడుకు పుట్టాడు.

ఆ తర్వాత ఒక ఆడపిల్ల పుట్టింది.

అందమైన పూలతోటకు వసంతమొచ్చింది. మరింత ఆనందంగా ఉన్నారు.

నలుగురు స్నేహితులయ్యారు.

ఎంత అందమైన జీవితం కోలిన్ ది. ప్రేమించడం ఎలాగో నేర్చుకోవాలి.

మధ్యలో కథ ఆగింది.

కోలిన్ మౌనంగా కూర్చున్నాడు. మౌనం భరించడమూ, భంగపరచడం రెండూ చేయలేని పరిస్థితిలో ఉన్నాను.

కాసేపటికి మళ్ళీ కోలిన్ చెప్పాడు.

ఒక సారి స్కీయింగ్ చేస్తూ కొడుక్కి యాక్సిడెంట్ అయిందనీ, పెరాలసిస్ తో బెడ్ మీదే కదల్లేని పరిస్థితి వచ్చిందనీ చెప్పాడు.

"ఇప్పుడెలా ఉన్నాడు."

"అతను పోయిన సంవత్సరమే పోయాడు"

వళ్ళు చల్లగా అయినట్టనిపించింది.

"మరి ఆమె ఎలా తట్టుకుంటోందీ విషాదం?"

"తట్టుకునే అవసరం రాలేదు." ఒక్క క్షణం ఆగి చెప్పాడు. "నా భార్య చనిపోయి రెండు సంవత్సరాలవుతోంది రాజ్. "

గుండె ఝల్లుమంది. రాత్రి చలికి వణికాను.

తుఫానుకు తోట అందం శ్రద్ధ ఏముంటుంది? . మది లేని విధికి మనుషుల కన్నీటిని లక్ష్యపెట్టాల్సిన అవసరమేముందీ?

మౌనంగా కూర్చున్నాడు. అలానే కూర్చోనిచ్చాను.

అతని ముఖం చూసే ధైర్యం లేదు. చెంపల వెంట నదులే ఉంటాయో, సముద్రాలే కనిపిస్తాయో అన్న భయంతో కదలలేక పోయాను.

కూతురికి పెళ్ళైపోయింది. తను ఉంటున్న ఇల్లు ఖాళీ చేసి చిన్న ఇంట్లోకి మారాడు. మనసు లో జ్ఞాపకాలు దూరమవడానికి మనిషి భౌతికమైన వాటికి దూరం గా పారిపోతుంటాడేమో?

ఇష్టమైన వారిని

ప్రేమించకుండా మనసుకి అడ్డు చెప్పలేము.

అంతులేని ప్రేమకు హద్దు గీయలేము.

ప్రేమ వీడాక బాధనూ ఓడించలేము.

అప్పటికి టైమెంత అయిందో తెలియదు.

అతన్ని వంటరిగా వదిలేస్తే మంచిదనిపించి లేచాను.

" కోలిన్ , నిద్రపోతారా ఇంక , నేను వెళ్తాను"

డోర్ వరకూ వచ్చాడు. గుడ్ నైట్ చెప్పుకున్నాం. నావెనక తలుపు మూసుకుంది. . కారిడార్ లో నడుస్తుంటే ఒక అనుమానమొచ్చింది.

మరి భార్యకు చీరలు కొన్నాడెందుకు?

కోలిన్ మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా? ఏమో! అలాంటివిషయాల్లో వాళ్ళకంత పట్టింపులుండవు. అయినా సరే , నా మనసెందుకో ఒప్పుకోలేక పోయింది.

కానీకొడుకు కోసం కూడా కొన్నాడు. ఎందుకు కొన్నట్టూ?

*(ముగింపు వచ్చేనెల)*



*డా. గువ్వల రాజశేఖర రెడ్డి ,*

*MS FRCSed, FRCSeng*

*రాయల్ హాస్పిటల్, కస్తూరిబాయిపేట,*

*విజయవాడ - 520010*

*మా క్లాస్ మేట్ రాజశేఖర్ రెడ్డి విజయవాడ పరిసరాల్లో పరిచయం అవసరం లేని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్.*

*'జెంటిల్ మాన్' అన్న మాటకు నిర్వచనం.*

*సహృదయుడు. పెద్దన్న లాంటి వ్యక్తిత్వం. మేము ఎం. బి. బిఎస్ లో ఉండగా తనని మా క్లాస్ రిప్రజెంటేటివ్ గా ఎన్నుకున్నాం. ఇప్పటికీ మా 1982 బాచ్ వాళ్ళందరికీ ఆయన మాటంటే రాయల వారి శాసనం. అంతే కాదు రాయలవారిలా తను కూడా కవి. చక్కటి కవిత్వం రాస్తాడు.*

*వచ్చే నెల ముగింపు తర్వాత అతని వ్యక్తిత్వం మరింత అర్థమవుతుంది. ఈ కథ వ్రాయడానికి అవకాశమిచ్చిన రాజశేఖర్ కు ధన్యవాదాలు తెలుపుకుంటూ*

–చందు శైలజ

Post your comments